

కీసరగుట్టలోని దుర్గామాత శుక్రవారం భక్తులకు శాకాంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా ఆలయ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ, ఈవో సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రామలింగేశ్వరుడిని దర్శించుకున్న అనంతరంమహిళా భక్తులు అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. - కీసర,జూలై26

సాగు జోరు!



కేశంపేటలో వరినారు తీస్తున్న కూలీలు

ఇటీవల జిల్లాలో కురుస్తున్న ముసురు వానలకు సాగు జోరందుకుంది. నిన్న మొన్నటి వరకు అక్కడక్కడా మెట్ట పంటలు సాగుచేసినా.. వరి నాట్లు మాత్రం పెద్దగా ప్రారంభం కాలేదు. చెరువులు, కుంటలు, బోరు బావుల్లో కొద్దిపాటి నీరున్న చోట్ల మాత్రమే వరి నాట్లు వేసుకున్నారు. అయితే, ఐదారు రోజులుగా జిల్లావ్యాప్తంగా ముసురు వర్షాలు పడుతుండడంతో వరినాట్లు జోరందుకున్నాయి. ఇప్పటికే రైతులు నార్లు పోసుకొని సిద్ధంగా ఉండడంతో ఇప్పుడు నాట్లు వేసే పనిలో బిజీ అయ్యారు. జిల్లాలో ఇక పెద్ద ఎత్తున వరి సాగు ప్రారంభం అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు కూడా భావిస్తున్నారు. అందుకనుగుణంగా వ్యవసాయ శాఖ రైతులకు కావాల్సిన ఎరువులను సిద్ధంగా ఉంచింది. దీంతో రైతులు ఎరువులు కూడా కొని సిద్ధంగా ఉంచుకున్నారు. వరినాట్లు ప్రారంభం కావడంతో పల్లెలన్నీ పచ్చగా కనిపిస్తున్నాయి.

- కేశంపేట, జూలై 26:

'సమతామూర్తి'ని సందర్శించిన మాజీ రాష్ట్రపతి

- స్వర్ణ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసిన రామ్‌నాథ్ కోవింద్
- ఆశీర్వచనాలు అందజేసిన త్రిదండి చిన జీయర్‌స్వామి



మాజీ రాష్ట్రపతిని ఆశీర్వదిస్తున్న చిన జీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్, జూలై 26: ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు మూడు రోజుల క్రితం నందిగామలోని కన్హా శాంతివనానికి వచ్చిన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శుక్రవారం శంషాబాద్ పరిధిలోని ముచ్చింతల్‌లో ఉన్న సమతామూర్తి స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. ఆయనకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం చిన జీయర్‌స్వామితో కలిసి 108 దివ్యదేశాలు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చినజీయర్‌స్వామి స్ఫూర్తి కేంద్రం విశిష్టతను కోవింద్‌కు వివరించారు. అనంతరం మంగళశాసనములు, తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు. అదేవిధంగా శ్రీరామానుజుల వారి ప్రతిమను అందజేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు స్ఫూర్తి కేంద్రానికి వచ్చిన కోవింద్ దాదాపు రెండు గంటలు అక్కడే గడిపారు. భవిష్యత్‌లో స్ఫూర్తి కేంద్రం మంచి ఆధ్యాత్మిక కేంద్రం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కోవింద్ అక్కడి నుంచి బయలుదేరి ఢిల్లీ వెళ్లారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మాజీ రాష్ట్రపతి కోవింద్‌కు జిల్లా అధికారులు వీడ్కోలు పలికారు. స్ఫూర్తి కేంద్రానికి మాజీ రాష్ట్రపతి రావడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అహోబిలం జీయర్‌స్వామి, మైహోం గ్రూప్స్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయ నూతన భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

ధరణి సమస్యలను పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ శశాంక

కడ్తాల్, జూలై 26: పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించి రైతుల ఇబ్బందులు తీర్చాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. భూ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. శుక్రవారం ఆయన కడ్తాల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ ముంతాజ్‌ను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయ నూతన భవనాన్ని కలెక్టర్ పరిశీలించి త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భవనాన్ని ప్రారంభించి వీలైనంత త్వరగా వినియోగంలోకి తెచ్చేలా చూడాలని తహసీల్దార్‌కు సూచించారు.



యాచారంలోని తిరుమలేశుడి ఆయల భూమిని కబ్జా చేసి నాటిన కడీలు

ఆలయ భూమే కదా.. ఆక్రమించేద్దాం!

కబ్జా చేసి.. కడీలు నాటిన అక్రమార్కులు!

యాచారంలో కబ్జాకు గురౌతున్న తిరుమలేశుడి భూములు

- ఇప్పటికే నాలుగు ఎకరాలకు పైగా అన్యాక్రాంతం
- మిగిలిన మాన్యానికీ శఠగోపం..
- పట్టించుకోని దేవాదాయ శాఖ అధికారులు

యాచారం, జూలై 26: యాచారం మండల కేంద్రంలోని శ్రీ తిరుమలేశుడి ఆలయ భూములకు రక్షణ కరువైంది. అక్రమార్కులు ఆలయ భూమిని దర్జాగా కబ్జా చేస్తున్నారు. ఈ భూమిలో అక్రమార్కులు కొందరు కడీలు నాటి యథేచ్ఛగా భూ కబ్జాకు పాల్పడుతున్నారు. యాచారం మండల కేంద్రంలోని సర్వే నెంబర్42లో 10.21 ఎకరాల తిరుమలేశుడి ఆలయ భూమి ఉంది. ప్రస్తుతం ఆ భూమి విలువ రూ.25 కోట్లకు పైగానే ఉంటుంది. ఇప్పటికే ఆ భూమిలో సుమారు నాలుగు ఎకరాలకు పైగా అన్యాక్రాంతమైంది. మిగిలిన భూమిపై కన్నేసిన కొందరు అక్రమార్కులు కబ్జాకు యత్నిస్తున్నారు. ఆలయ భూమిని ఆక్రమించేందుకు గోప్యంగా పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగానే ఆలయ భూమిలో పలుచోట్ల కడీలు నాటారు. కేవలం ఇంటి నిర్మాణం చేయడానికి 120, 150, 200 గజాల చొప్పున కబ్జాకు పాల్పడుతున్నారు. ఆలయ భూమిలో కడీలు నాటినా ఎవరూ పట్టించుకోకపోవడంతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. ఇక్కడి భూములకు భారీగా డిమాండ్ పెరగడంతో దేవుడి మాన్యాన్ని కాజేయడానికి కొంతమంది నాయకులు పావులు కదుపుతున్నారు. ఏడేళ్ల క్రితం ఇదే భూమిని కాజేయడానికి నగరానికి చెందిన కొందరు బడా నాయకులు యత్నించారు. దీంతో అప్పట్లో పత్రికలలో వచ్చిన కథనాలతో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. దీంతో కబ్జారాయుళ్లు వెనక్కి తగ్గారు. మళ్లీ కొంత కాలంగా ఈ భూమిపై కన్నేసిన వ్యక్తులు ఆలయ భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు. ఆలయ భూమిని కాజేయడానికి పెద్దల హస్తం ఉండి ఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ భూమిలో పలుచోట్ల కడీలు నాటడంతో పాటు ఫెన్సింగ్ వేశారు. నకిలీ పత్రాలతో భూమిని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కొంత మంది నాయకులు పావులు కదుపుతున్నారు. ఇప్పటికైనా ఆలయ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. దేవాదాయ శాఖ అధికారులు కల్పించుకొని ఆలయ భూమిని రక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

> ఆది రూ. 25 కోట్లకు పైగా విలువ చేసే భూమి. ఇంకేముంది అక్రమార్కుల కన్ను దానిపై పడింది. అలయ భూమే కదా.. అని యాచారంలోని తిరుమలేశుడి మాన్యాన్ని అక్రమించేద్దామని అక్రమార్కులు పావులు కదుపుతున్నారు. ఇప్పటికే నాలుగెకరాలకు పైగా కబ్జా చేసి కడీలు నాటారు. ఇంత జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు.



ఆలయ భూమి కబ్జా చేస్తే కఠిన చర్యలు

ఆలయ భూమి కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆలయ భూములను కాపాడే బాధ్యత అందరిది. త్వరలో ఆలయ భూమిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. ప్రకృతి వనం ఏర్పాటుకు కొంత మేర ఫెన్సింగ్ వేశారు. వనంలో మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- ప్రణీత్, దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్

సొంత డబ్బుతో ధూపదీపాలు

యాచారం మండల కేంద్రానికి చెందిన కొండాపురం యాదయ్య తన ఆస్తులను అమ్మి ఆలయ అభివృద్ధికి పాటుపడ్డారు. ప్రస్తుతం ఆయన కుమారుడు రాజేష్ సొంత డబ్బులతో ఆలయంలో స్వామివారికి పూజలు చేస్తుంటారు. ప్రతీ ఏటా స్వామి వారికి కల్యాణోత్సవం. రథోత్సవాన్ని గ్రామస్తులు నిర్వహిస్తారు. కాగా భక్తులకు తాగునీటి ఇబ్బంది తీర్చడానికి కోసం మొండిగౌరెల్లి ఎంపీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర లక్ష్మమ్మ తన సొంత డబ్బుతో బోర్ వేయించారు.

కార్గిల్ యుద్ధ వీరులకు ఘన నివాళి



శంషాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ,బీజేవైఎం నేతలు

శంషాబాద్ రూరల్/శంషాబాద్, జూలై 26 : కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన వీరులకు బొల్లారం ఆర్మీ స్కూల్ విద్యార్థులు శుక్రవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘనంగా నివాళులు అర్పించారు. వారు చేసిన త్యాగలను గుర్తు చేసుకున్నారు. జూలై 26న విజయ్ దివస్ సందర్భంగా వారు ప్రతి ఆర్మీ స్కూల్ విద్యార్థులు విమానాశ్రయంలో ఈ వేడుకలు నిర్వహించి వారి ఘన నివాళులు అర్పిస్తారు. దేశం పట్ల యుద్ధవీరుల నిస్వార్థ, అంకిత భావాన్ని వారు గుర్తు చేసుకుని నృత్యం రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆర్మీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, జీఎంఆర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో..

కార్గిల్ అమర వీరులకు గురువారం రాత్రి బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జాతీయ కార్యదర్శి శ్యామరాజు మాట్లాడుతూ భారత సరిహద్దులు దాటి మనదేశంలోకి అక్రమంగా ప్రవేశించిన పాకిస్తాన్ ముష్కర సైన్యాన్ని వీరోచిత పోరాటంతో తరిమికొట్టి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వారి త్యాగాలను దేశ ప్రజలందరూ స్మరించుకుంటున్నారన్నారు. కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు అర్పించిన 527 మంది వీర సైనికుల స్మృతికి నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్, బీజేపీ నాయకులు వంశీ, గాజుల రాహుల్, వీరేందర్ రెడ్డి పాల్గొన్నారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కార్గిల్ విజయ్ దివస్‌ను జరుపుకుంటున్న విద్యార్థులు

144 సెక్షన్ కొనసాగింపు

- మత ఘర్షణలు తలెత్తకుండా చిలుకూరులో పోలీసుల పహారా

మొయినాబాద్ రూరల్, జూలై 26 : మొయినాబాద్ మండలం చిలుకూరులో 144 సెక్షన్ కొనసాగుతోంది. చిలుకూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్‌లో 134లో ఓ ప్రవాస భారతీయుడికి పట్టా భూమి ఉంది. దాని పక్కనే మరో సర్వే నంబర్ 133లో వక్ఫ్‌బోర్డుకు చెందిన పురాతన స్థలం, ఓ కట్టడం ఉంది. అయితే, ఓ వర్గానికి చెందిన స్థలంలో నిర్మాణం తొలగించడంపై రెండు వర్గాలు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. మతపరమైన వివాదాలకు దారితీయకుండా సైబరాబాద్ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ రెండు వర్గాలవారికి నచ్చజెప్పి.. ఎవరినీ అక్కడికి రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వక్ఫ్‌బోర్డు స్థలం వద్దకు వెళ్లకుండా ఉండేందుకు బారికేడ్లను ఏర్పాటు చేశారు. హిమాయత్ నగర్ చౌరస్తా, చిలుకూరు బాలాజీ ఆలయం వద్ద బారికేడ్లను ఏర్పాటు చేశారు. పురాతణ కట్టడం వద్ద పోలీసులు పహారా కొనసాగుతోంది. బాలాజీ దేవాలయానికి వచ్చే భక్తులను సైతం వివరాలు అడిగిన తర్వాతనే దర్శనానికి అనుమతిస్తున్నారు. ఈ నెల 30 వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కావడంతో ఓ వర్గం వారు ప్రార్థనలు చేసిన తరువాత ఎటువంటి ఘటనలూ చోటు చేసుకోకుండా గట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.



చిలుకూరు బాలాజీ ఆలయ కమాన్ వద్ద పహారా కాస్తున్న పోలీసులు

82.59 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



చెర్లపటేల్‌గూడలో మొక్కలునాటి నీరు పోస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్డీవో శ్రీలత తదితరులు

ఇబ్రహీంపట్నం, జూలై 26: వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో మొత్తం 82.59 లక్షలు మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఇప్పటివరకు 28.69లక్షల మొక్కలు నాటామని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండల పరిధి చెర్లపటేల్‌గూడలోని పార్కు స్థలంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలతతో కలిసి మొక్కలు నాటారు. వర్షాలు కురుస్తున్న ఈ తరుణంలో జిల్లాస్థాయి అధికారి నుండి పంచాయతీ అధికారి వరకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 6వేల మొక్కలకు తగ్గకుండా నాటాలని ఆమె ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, గ్రామ పంచాయతీ స్థలాలతోపాటు రోడ్లకు ఇరువైపులా, రైతుల పొలం గట్ల వెంట మొక్కలు నాటాలన్నారు. ప్రతీ ఇంటికి 5-6మొక్కలు నాటాలని ఇంటి ముందు, పెరట్లో ఈ మొక్కలు నాటుకోవాలన్నారు. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి భావితరాల జీవన ప్రమాణాలు పెంచేందుకు అడవుల పెంపకం తప్పనిసరని ఆమె అన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ ఏపీడీ సక్రియానాయక్, ఎంపీడీవో వెంకటమ్మ, ఏపీవో తిరుపాచారి, ఈసీ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కొండన్నగూడ అసైన్డ్ భూములపై విచారణ జరిపించాలి

షాద్‌నగర్ రూరల్, జూలై 26: ఫరూఖ్‌నగర్ మండలం పరిధిలోని కొండన్నగూడలో గల అసైన్డ్ భూములపై సమగ్ర విచారణ జరిపించాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం షాద్‌నగర్ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఒకే కుటుంబం.. ఎక్కువ భూములను తమ అధీనంలో ఉంచుకున్నాయని ఆరోపించారు. అంతేగాకుండా నిబంధనలకు విరుద్ధంగా భూముల్లో నుంచి మట్టిని అక్రమంగా అమ్ముకుంటున్నారని తెలిపారు. అధికారులు సమగ్ర విచారణ చేయాలని పేర్కొన్నారు.








FARNAZ



పంట పొలంలో జింక ప్రత్యక్షం

వికారాబాద్ అటవీ అధికారులకు అప్పగింత

చేవెళ్ల, జూలై 26 : మండల పరిధిలోని మీర్జగూడ గ్రామంలో శుక్రవారం జింక ప్రత్యక్షమైంది. గ్రామానికి చెందిన ఆవుల జంగయ్య పొలం పనులు చేస్తుండగా జింక పొలంలోకి వచ్చింది. పక్కనే ఉన్న పశువుల పాకలోకి వెళ్లడంతో ఆయన వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇచ్చాడు. దాంతో పోలీస్‌లు అక్కడికి చేరుకుని వికారాబాద్ అటవీ ప్రాంతం నుంచి జింక తప్పిపోయి వచ్చినట్లు భావించారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే, వీధికుక్కలు జింకను వెంబడించడంతో జింకకు గాయాలయ్యాయి. పోలీసులు వైద్యం చేయించి వికారాబాద్ అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.



స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

ఇబ్రహీంపట్నం, జూలై 26: స్థానిక సంస్థల ఎన్నికల కోసం సీపీఐ కార్యకర్తలు సన్నద్ధం కావాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచులుగా, వార్డుసభ్యులుగా, ఎంపీటీసీ, జెడ్పీటీసీలుగా పోటీ చేసేందుకు తగిన ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు చేస్తూనే ప్రజలకు దగ్గర కావాలన్నారు. స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తుపై అధిష్టానమే నిర్ణయిస్తుందన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు రవీంద్రాచారి, కావలి పర్సింహ, ముత్యాల యాదిరెడ్డి, పోచమోని నీలమ్మ, లక్ష్మయ్య, కృష్ణ, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంతి గృహం అసంపూర్తి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్‌కుమార్



చీమలదరిలో పీహెచ్‌సీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మోమిన్‌పేట్, జూలై 26: విశ్రాంతి గృహం అసంపూర్తి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని నూతన విశ్రాంతి గృహాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను గుర్తించి ప్రతిపాదనలను కలెక్టర్ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతిపాదనలు పంపిస్తే నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. భవనాన్ని నిర్మించి ఆరు సంవత్సరాలు గడుస్తున్నా నిరుపయోగంగా ఎందుకు ఉంచారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా మండల పరిధిలోని చీమలదరి గ్రామంలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సీసీరోడ్డు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ ప్రణీత్, ఎంపీడీవో యాదగిరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నె శంకర్‌యాదవ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.





భవిష్యత్తు బీజేపీదే : ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

కీసర రూరల్, జులై 16: భవిష్యత్తులో రాష్ట్రంలో బీజేపీదే ప్రభుత్వమని రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నాగారం మున్సిపాలిటీ స్టార్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం భారతీయ జనతా పార్టీ(బీజేపీ) మేడ్చల్‌రూరల్ జిల్లా కార్యకవర్గ సమావేశం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని ఆందోళన వ్యక్తం చేశారు. మిగులు నిధులతో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల మయం చేశారని విమర్శించారు. ఏక కాలంలోనే రూ.రెండు లక్షల వరకు రుణ మాఫీ చేస్తామని చెప్పి రూ.లక్ష లోపు వారికి కూడా మాఫీ చేయలదేని ఆరోపించారు. కౌలు రైతులకు రుణాలు అందిస్తామని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం ఆ ఊసే ఎత్తటం లేదన్నారు. స్వల్ప కాలంలోనే కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అసమ్మతిని కూడగట్టుకుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలుచుకోవాలని బీజేపీ శ్రేణులకు సూచించారు. అనంతరం కార్గిల్ దివస్‌లో భాగంగా ఆ యుద్ధంలో పాల్గొన్న వీర జవాన్లను ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, నాగారం మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు వేణుగోపాల్, కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్, లక్ష్మి, బోగారం ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సురేష్, నాయకులు బిక్కునాయక్, చిత్తరంజన్‌రెడ్డి, శోబారెడ్డి, బుద్ధి శ్రీనివాస్, శ్యాంసుందర్‌శర్మ, ఏనుగు రాజిరెడ్డి పాల్గొన్నారు.



రైల్వే లైన్ మంజూరు చేయండి

» కేంద్ర రైల్వేశాఖ మంత్రికి ఆచారి వినతి



అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆచారి

ఆమనగల్లు, జూలై 26: కేంద్ర రేల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను శుక్రవారం జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. సూర్యాపేట నుంచి నల్లగొండ, దేవరకొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ మీదుగా గద్వాల వరకు రైల్వేలైన్‌ను మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి ఆచారి వినతిపత్రం అందజేశారు. దాంతో రైల్వేలైన్ ఏర్పాటుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆచారి తెలిపారు. ఆయనతో బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ రావు, తదితరులు ఉన్నారు.



నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

దివ్యాంగుల సంక్షేమంపై చిన్నచూపు?

షాద్‌నగర్ అర్బన్, జూలై 26: రాష్ట్ర బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమానికి నిధులు కేటాయించలేదని, వారి పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని దివ్యాంగులు నిరసన వ్యక్తం చేశారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. 2,91,159 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమం కోసం నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌ను సవరించి, దివ్యాంగుల కోసం నిధులు కేటాయించి, పింఛన్‌ను ఆరువేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల మేరకు దివ్యాంగులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం నాయకులు చేగూరు శేఖర్‌గౌడ్, సంతోష, కుసుమ, మునీరా, మల్లేష్, నర్సింలు, ఆంజనేయులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కొడిచర్లతండా వాసులు

ప్రభుత్వ స్థలాన్ని క్రిష్టియన్ కమ్యూనిటీకి కేటాయించొద్దు

కొత్తూర్, జూలై 26: మండల పరిధిలోని కొడిచర్లతండాలోని సర్వే నెంబర్ 198లో గల రెండెకరాల ప్రభుత్వ భూమిని క్రిష్టియన్ కమ్యూనిటీ హాల్‌కు కేటాయించవద్దని కొడిచర్ల మాజీ ఎంపీటీసీ బి.రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో తండావాసులు శుక్రవారం తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. నూతనంగా ఏర్పడిన కొడిచర్లతండాకు గ్రామపంచాయతీ భవనం లేదని, ఉన్న ప్రభుత్వ స్థలాన్ని క్రిష్టియన్ కమ్యూనిటీ హాల్‌కు కేటాయిస్తే, ప్రభుత్వ స్థలం లేకుండా పోతుందని పేర్కొన్నారు. ఆ భూమిని గ్రామపంచాయతీ అవసరాలకు ఉపయోగించాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో కొడిచర్ల తండా మాజీ సర్పంచ్ సంతోష్‌నాయక్, నాయకులు బిచ్చునాయక్, మోహన్‌నాయక్, విష్ణునాయక్, దేవునాయక్, కుమార్‌నాయక్, సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

'ఎస్టీ డిక్లరేషన్'ను అమలు చేయాలి

రంగారెడ్డి అర్బన్, జూలై 26 : ఎస్టీ డిక్లరేషన్ హామీని వెంటనే అమలు చేయాలని బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బనావత్ సాయిలాల్ నాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్ వద్ద నిరసన ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌డ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా 2023 ఆగస్టు 26న చేవెళ్ల బహిరంగ సభలో ప్రకటించిన ట్రైబల్ డిక్లరేషన్ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఇచ్చిన హామీని అమలు చేస్తానని చెప్పినా.. నేడు ఎస్టీలను విస్మరిస్తున్నారని అన్నారు. ఎస్టీ డిక్లరేషన్‌లో ప్రకటించిన అంశాలను వెంటనే అమలు చేయాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమం చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు.

బషీరాబాద్ ఠాణాకు వాస్తు దోషమట!!

» ప్రధాన డోర్ మూసి ఉంచడంపై స్థానికంగా చర్చ

బషీరాబాద్, జూలై 26: బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ప్రధానద్వారం మూసి కనిపించడంతో శుక్రవారం ఫిర్యాదు చేసేందుకు వచ్చిన పలువురు అయోమయానికి గురయ్యారు. ఇదేంటి పోలీస్‌స్టేషన్ తలుపులు మూసి ఉన్నాయని, ఒక్కసారిగా ఆలోచనలో పడి దిక్కులు చూడాల్సి వచ్చింది. అప్పటికే పక్కన గది డోర్‌లోంచి పోలీసుల రాకను చూసి లోపలికి వెళ్లి అక్కడ ఏర్పాటు చాంబర్‌లో ఫిర్యాదులు అందజేశారు. ఇటీవల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఓ ఉన్నతాధికారి ఈ పోలీస్‌స్టేషన్‌కు వాస్తుదోషం ఉందని చెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలో వాస్తు కోసమే పోలీసులు ప్రధాన ద్వారం నుంచి రాకపోకలు బంద్ చేసినట్లు పలువురు గుసగుసలాడుకున్నారు. ఈ విషయం స్థానిక ప్రజల్లో చర్చనీయంశమైంది.



పోలీస్‌స్టేషన్ ప్రధానం ద్వారం మూసి ఉంచిన దృశ్యం

ఘనంగా పోచమ్మ బోనాలు

చౌదరిగూడ/కొందుర్గు, జూలై 26: జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని చేగిరెడ్డి ఘణాపూర్, గుంజల్‌పహాడ్, జిల్లేడ్, రావిర్యాల, తుమ్మలపల్లి పెద్ద ఎల్కిచర్ల, కాస్లాబాద్, లచ్చంపేట్ తదితర గ్రామాల్లో శుక్రవారం పోచమ్మ దేవతకు బోనాలను ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఇంటి నుంచి బోనాన్ని తయారు చేసుకొని మహిళలు ఆలయానికి బయల్దేరారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. యువకుల కేరింతలు, ఆట పాటలు, నృత్యాలు విన్యాసాల మధ్య బోనాల ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులందరూ పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. వర్షాలు బాగా కురిపించి ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు.



పర్వతాపూర్‌లో బోనాలతో మహిళలు

కొందుర్గు మండలంలో..

కొందుర్గు మండలం పర్వతాపూర్, చిన్నఎల్కిచర్ల, తంగళ్ళపల్లి గ్రామాల్లో శుక్రవారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పర్వతాపూర్‌లో మైసమ్మ, చిన్నఎల్కిచర్లలో పోశమ్మ, తంగళ్లపల్లిలో మైసమ్మ, పోచమ్మ గ్రామ దేవతలకు మహిళలు బోనాలతో మొక్కులు తీర్చుకున్నారు. ఆయా గ్రామాల్లో ఊరేగింపుగా వెళ్ళిన మహిళలు గ్రామ దేవతల దేవాలయాల చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేసి, నైవేద్యం సమర్పించారు. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో వివిధ పార్టీల డాక్టర్ వెంకటేష్, రవికుమార్, శేఖర్, రఘుయాదవ్, మల్లేష్ గౌడ్, డి. రాంచంద్రయ్య, గోవర్ధన్‌గౌడ్, కె శంకర్‌జీ, శంకర్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, నర్సింలు, రామకృష్ణ, వెంకటేష్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తుమ్మలపల్లిలో బోనాలతో ఆలయానికి బయల్దేరిన మహిళలు,గ్రామస్థులు

కొత్త భవనం
ప్రారంభమెన్నడో?

» శిథిలావస్థలో పాత అంగన్‌వాడీ భవనం

» వర్షానికి ఉరుస్తూ పెచ్చులూడుతున్న వైనం

» కొత్త భవనానికి తాళం

» అంగన్‌వాడీ పిల్లలకు అవస్థలు

ధారూరు, జూలై 26: పిల్లల కోసం ప్రభుత్వం కొత్తగా అంగన్‌వాడీ భవనం నిర్మించినా ప్రారంభానికి నోచుకోవడంలేదు. దీంతో పాత అంగన్‌వాడీ భవనంలోనే అంగన్‌వాడీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పటికే పాతభవనం శిథిలావస్థకు చేరుకుంది. దీనికి తోడు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పాతభవనంలో ఊరుస్తూ పెచ్చులూడుతున్నాయి. మండలంలోని అవుసుపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ భవనం పరిస్థితి ఇది. గ్రామంలోని శిథిలావస్థలో ఉన్న భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. వర్షాలకు గురువారం భవనం ఉరుస్తూ పైనుంచి పెచ్చులు ఊడిపడ్డాయి. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు కూర్చునే గదిలో పెచ్చులు ఊడిపడి గదిలో వర్షపునీరు కారుతోంది. దీంతో అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు కూర్చోవటానికి ఇబ్బందిగా మారింది. పెచ్చులూడి పిల్లల మీద పడితే ప్రమాదం జరిగే అవకాశముందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



అవుసుపల్లిలో పెచ్చులుడుతున్న అంగన్‌వాడీ భవనం

కొత్త అంగన్‌వాడీ భవనానికి తాళం

కొత్తగా నిర్మించిన అంగన్‌వాడీ భవనం తాళం వేసి ఉంది. ఈ భవన నిర్మాణం పూర్తయి ఏడాది గడుస్తున్నా సంబంధిత అధికారులు ఈ భవనాన్ని స్వాధీనం చేసుకుని ప్రారంభించలేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో శిథిలావస్థలో ఉన్న భవనంలోనే అంగన్‌వాడీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారని వారు చెప్పారు. కాగా ఈ భవనం నిర్మించిన కాంట్రాక్టర్ భవన నిర్మాణం పనుల డబ్బులు చెల్లించలేదని అంగన్‌వాడీ భవనాన్ని తాళం వేసినట్లు తెలిసింది. నిర్మాణం పూర్తయిన అంగన్‌వాడీ భవనాన్ని అధికారులు అందుబాటులోకి తీసుకురాకుండా జాప్యం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కొత్త భవనాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.



అవుసుపల్లిలో తాళం వేసిన ఉన్న కొత్త అంగన్‌వాడీ భవనం

శిథిలావస్థలో పాఠశాల భవనాలు

కొడంగల్, జూలై 26: కొడంగల్ మున్సిపల్ పరిధిలోని కొండారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థలో ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురుస్తుండటంతో పాఠశాల తరగతి గదుల్లోకి వర్షపు నీరు చేరుతుందని, దీంతో విద్యార్థులను పాఠశాల వరండాలో కూర్చొబెట్టి ఉపాధ్యాయులు పాఠాలు బోధించాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోయారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని తొలగించి నూతన భవనాన్ని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.



కొండారెడ్డిపల్లి పాఠశాల ఆవరణలో విద్యార్థులు

కులకచర్ల: చౌడాపూర్ మండలంలోని మరికల్ జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల ఆవరణలోకి వర్షపు నీరుచేరింది. దీంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడం లేదు. చిన్నపాటి వర్షం కురిసినా పాఠశాల ఆవరణ మొత్తం చిత్తడిగా మారుతుంది. బురదలోనే విద్యార్థులు ప్రార్థన, ప్రతిజ్ఞ చేస్తున్నారు. బయటి నుంచి పాఠశాల లోపలికి వెళ్లేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిల్వ ఉన్న నీటిలో క్రిమికీటకాలు పెరిగి దుర్గంధం వెదజల్లుతోంది. విద్యార్థులు వ్యాధుల బారిన పడకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండులు కోరుతున్నారు.



మరికల్ ఉన్నత పాఠశాల ముందు నిల్వ నీటిలో నుంచి వెళ్తున్న విద్యార్థులు



పెంజర్లఓ పల్లె పకృతివనాన్ని పరిశీలిస్తున్న సీఈవో కృష్ణారెడ్డి

వనమహోత్సవ లక్ష్యాన్ని పూర్తి చేయాలి

» జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

కొత్తూర్, జూలై 26: వనమహోత్సవ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు మండల, గ్రామాధికారులు కృషి చేయాలని జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి సూచించారు. మండల పరిధిలోని పెంజర్ల గ్రామ పంచాయతీని కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పింఛన్ల పంపిణీ, పల్లె ప్రగతి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ వనమహోత్సవ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాల్గొని విరివిగా మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు కృషి చేయాలన్నారు. మండలానికి నిర్దేశించిన లక్ష్యాన్ని మించి మొక్కలు నాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు. పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో అరుంధతి, ఎంపీవో విజయలక్ష్మి, గ్రామ కార్యదర్శి సురేందర్, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్‌ను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఆమనగల్లు అభివృద్ధి పై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష

» అసంపూర్తి పనులు

పూర్తి చేయాలి : బీఆర్‌ఎస్ నాయకులు

ఆమనగల్లు, జూలై 26: ఆమనగల్లు పట్టణంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురాకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని బీఆర్‌ఎస్ నాయకులు హెచ్చరించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మేడిగడ్డ-శంకర్‌కొండ రోడ్డులో వాగుపై వంతెన నిర్మాణ అసంపూర్తి పనులను శుక్రవారం మాజీ జడ్పీటీసీ అనురాధ పత్యానాయక్ ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్‌కు రూ.4.50కోట్లు, కళాశాల భవన నిర్మాణానికి రూ.2.50 కోట్లు, మేడిగడ్డ వాగుపై వంతెన నిర్మాణానికి రూ.3.27 కోట్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వం విడుదల చేసినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు విడుదల కాక.. 50 శాతానికి పైగా పనులు పూర్తయ్యాక మూడు పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రూ.17.50 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. మాజీ ఎంపీటీసీ కుమార్, సరిత పంతూనాయక్, మాజీ సర్పంచ్ సోనశ్రీనునాయక్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రమేశ్‌నాయక్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు గుత్తి బాలస్వామి, సతీష్, డేరంగుల వెంకటేశ్, భాస్కర్, శివకుమార్, ప్రసాద్, యాదయ్య, ఆనంద్, గణేశ్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

'రుణమాఫీ'ని సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు, జూలై 26: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పంట రుణమాఫీ డబ్బులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి అన్నారు. శుక్రవారం వ్యవసాయాధికారి లావణ్యతో కలిసి మండలంలోని కందుకూరు, గఫూర్‌గనర్, ధన్నారం, పులిమామిడి, గ్రామాల్లో పర్యటించారు. రైతుల ఇంటి వద్దకు, వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి రుణ మాఫీపై క్షేత్రస్థాయిలో అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పంటరుణ మాఫీ చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేసినట్లు ఆమె తెలిపారు. అనంతరం జైత్వారం(ఖల్సా) రెవెన్యూలో సాగుచేసిన మొక్కజొన్న, పత్తి, పంటలను పరిశీలించారు. పంటల బీమా పథకం కోసం కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతులు తమ సిబ్బందికి ధ్రువపత్రాలను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు ఎల్. రాజు, జె.శ్రీహరి రైతులు పాల్గొన్నారు.



పులిమామిడిలో రైతులతో మాట్లాడుతున్న గీతారెడ్డి



సీఎం పర్యటనకు భారీగా ఏర్పాట్లు

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూలై 26: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 28న కల్వకుర్తి పర్యటన నేపథ్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. సీఎం బహిరంగ సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి 20 వేల జనసమీకరణ చేస్తున్నట్లు చెప్పారు. సీఎం సభ ఏర్పాట్లను శుక్రవారం ఆర్డీవో శ్రీను, అధికారులు, నాయకులతో కలిసి నారాయణరెడ్డి పరిశీలించారు. సీఎం ఆవిష్కరించనున్న కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి విగ్రహాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 28న మధ్యాహ్నం 3.30 గంటలకు సీఎం కొత్త గేటుకు చేరుకుంటారని, జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ అనంతరం 4 గంటలకు కల్వకుర్తిలో జరిగే బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తారని చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి, ప్రత్యేక నిధుల మంజూరు గూర్చి సీఎంను కోరనున్నట్లు కసిరెడ్డి చెప్పారు. సీఎం సభ విజయవంతాన్ని నాయకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని కోరారు. నాయకులు భూపతిరెడ్డి, ఆనంద్, రామకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, సాయిరెడ్డి, మనోహర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ
చైర్మన్ పదవికి తీవ్ర పోటీ

» త్వరలో కొలువుదీరనున్న మహేశ్వరం మార్కెట్ కమిటీ పాలకవర్గం

» ఎస్టీ జనరల్‌కు కేటాయించడంతో ఆశావహుల ముమ్మర యత్నాలు

» కాంగ్రెస్ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నం

» నువ్వా-నేనా అనేలా.. కృష్ణానాయక్, రాజునాయక్



రాజునాయక్



కృష్ణానాయక్



మహేశ్వరం, జూలై 26 : ఏడు నెలలుగా మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గం లేక రైతులకు అందాల్సిన సేవలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఇటు పాలకవర్గం లేకపోవడంతో పాటు ప్రభుత్వ పర్యవేక్షణ కూడా లేక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కోక తప్పడంలేదు. మార్కెట్ కమిటీ పాలకవర్గం ఎప్పుడు ఏర్పాటు చేస్తారోనని వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. త్వరగా ఏర్పాటు చేయాలని మహేశ్వరం, కందుకూరు మండలాల రైతులు మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్‌తో పాటు పలువురు నేతలను ఆశ్రయిస్తున్నారు. పాత కమిటీలను ప్రభుత్వం రద్దు చేయడంతో నూతన కమిటీ ఏర్పాటు కాకపోవడంతో వ్యవసాయ మార్కెట్‌కమిటీ పాలన గందరగోళంగా తయారైంది. అదేవిధంగా మహేశ్వరం మార్కెట్ కమిటీ రిజర్వేషన్లను అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2015-16లోనే 5 విడతలుగా ఒకేసారి లాటరీ పద్ధతిన ప్రకటించారు. ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ నుంచి 2015లో విడిపోయి నూతనంగా ఏర్పాటైన మహేశ్వరం మార్కెట్‌కమిటీకి రెండు పర్యాయాలు జనరల్ మహిళ, మూడో విడత జనరల్, నాలుగో విడత ఎస్టీ జనరల్, ఐదో విడత జనరల్ మహిళకు రిజర్వేషన్లను కేటాయించారు. ప్రస్తుతం కొలువుదీరనున్న మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్టీ జనరల్‌కు రిజర్వేషన్ కావడంతో కందుకూరు, మహేశ్వరం మండలాలకు చెందిన అధికార పార్టీ నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం కాంగ్రెస్ పెద్దలను ప్రసన్నం చేసుకుంటూ ఎంతో కాలంగా పార్టీ కోసం తాము చేసిన కృషిని వివరిస్తూ ప్రయత్నాలు చేస్తున్నారు.

రేసులో ఉన్న గిరిజన నేతలు

మహేశ్వరం మండలానికి చెందిన ఆంగోత్ కృష్ణానాయక్, నేనావత్ రాజునాయక్, పాండునాయక్, అంద్యానాయక్, రాములునాయక్‌లు, కందుకూరు మండలం నుంచి ఆంజనేయులునాయక్, లచ్చానాయక్, కృష్ణానాయక్‌లు చైర్మన్ పదవి కోసం తీవ్రంగా పోటీ పడుతున్నారు. మహేశ్వరం మండలానికి చెందిన కృష్ణానాయియక్, రాజునాయక్‌లు చైర్మన్ పదవి కోసం నువ్వా, నేనా అనే రీతిలో కాంగ్రెస్ అధిష్టానం వద్ద ఎవరి ప్రయత్నాలు వారు ముమ్మరం చేశారు.

మూడు విడతలూ కందుకూరుకే..

మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీని 2015-16 లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మూడు విడతలుగా కందుకూరు మండలానికి చెందిన నేతలకే కేటాయించడంతో ఈసారి మహేశ్వరం మండలానికి చెందిన నాయకులకే చైర్మన్ పదవి వరించనుంది. కాగా, మహేశ్వరం మండలానికి చెందిన పలు గ్రామాల గిరిజన కాంగ్రెస్ నేతలు చైర్మన్ గిరిని దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

స్థానిక ' ఎన్నికలకు మజ్లిస్ సమాయత్తం..!

నేడు కొడంగల్‌లో కార్యకర్తలతో సమావేశం కానున్న ఒవైసీ

హైదరాబాద్,జులై 26(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయితీ, తదితర స్థానిక సంస్థల ఎన్నికల కోసం మజ్లిస్ పార్టీ కార్యకర్తలను సంసిద్ధం చేస్తోంది. మరో నెల రెండు నెలల్లో ఎన్నికలు జరుగనున్నందున ఆయా ప్రాంతాల్లోని ఓటు బ్యాంకు మైనారిటీ వర్గాలను సమన్వయం చేసుకునేందుకు మజ్లిస్ పార్టీ యంత్రాంగం విస్తృత స్థాయిలో సన్నహాలు ప్రారంభించింది. ఇటీవలి కాలం వరకు బీఆర్‌ఎస్‌తో మిత్ర పక్షంగా వ్యవహరించిన మజ్లిస్ క్రమంగా ఆ పార్టీకి దూరమై కాంగ్రెస్ పంచన చేరుతోంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ ఉనికి తగ్గిపోయి ఆ స్థానంలో బీజేపీ ప్రభావం పెరుగడంతో మజ్లిస్ పార్టీ అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో సిద్ధాంత పరంగా రాజకీయంగా తీవ్రంగా విభేధించే బీజేపీ విస్తరించకుండా అడ్డుకునేందుకు మజ్లిస్ ప్రయత్నాలు ప్రారంభించింది. ఆయా ప్రాంతాల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మైనారిటీ వర్గాలు ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు వీలుగా రాజకీయంగా నిర్ణయాలు తీసుకోవాలని మజ్లిస్ అధినాయకత్వం సంకేతాలు పంపినట్టు తెలిసింది. ఇందులో భాగంగా శనివారం వికారాబాద్ జిల్లా కొడంగల్ ప్రాంతంలో మజ్లిస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాల్గొంటారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ప్రధానంగా మైనారిటీ వర్గాల ఓటర్లు అధికంగా నివసించే ప్రాంతాల్లో ఓట్లు చీలిపోకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర వర్గాలను సమన్వయం చేసుకుని స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు మజ్లిస్ పార్టీ వ్యూహం రూపొందిస్తున్నట్టు తెలిసింది. ఆతర్వాత జిల్లాల వారీగా పార్టీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించాలని పార్టీ ఎమ్మెల్యేలకు సూచించినట్టు సమాచారం.

'హార్ట్‌ఫుల్‌నెస్' ఆధ్వర్యంలో ఒలంపిక్ క్రీడాకారులకు ధ్యాన తరగతులు

నందిగామ, జూలై 27: మండల పరిధిలోని కన్హా శాంతివనంలోని రాంచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ రిలయన్స్ ఫౌండేషన్ సహకారంతో పారిస్‌లో జరిగే ఒలంపిక్ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు ధ్యాన తరగతులు నిర్వహిస్తున్నట్లు హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 29 నుంచి ఆగస్టు 1 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధ్యానంతో క్రీడాకారులకు మానసిక ప్రశాంతతో పాటు, కొత్త ఆలోచనలకు పదును పెట్టడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. క్రీడాకారులు సంతృప్తికర క్రీడా ప్రదర్శన చేసేందుకు ఈ కార్యక్రమం ఎంతో సహకరిస్తుందన్నారు.

విద్యావ్యవస్థపై ప్రభుత్వానిది నిర్లక్ష్య ధోరణి

- అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులు
- రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం
- పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్

చేవెళ్ల/ఆమనగల్లు, జూలై 26 : విద్యార్థులపై ప్రభుత్వానిది నిర్లక్ష్య ధోరణి అని, పెండింగ్‌లో ఉన్న రూ.7వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఏబీవీపీ కన్వీనర్ కళ్లెం సూర్యప్రకాశ్, చేవెళ్ల నగర కార్యదర్శి షైపాల్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం చేవెళ్లలోని కళాశాలల విద్యార్థులతో కలిసి పెద్దసంఖ్యలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై దాదాపు గంట సేపు ధర్నా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజులను విడుదల చేయాలని కోరారు. ఉచితాలకు కాకుండా విద్యార్థుల పక్షాన ఉండి వెంటనే బకాయిలను విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రాజకీయ నాయకులు విద్యార్థులు జీవితాలతో ఆటలు ఆడుతున్నారని మండిపడ్డారు. వెంటనే ఫీజు నియంత్రణ చట్టం అమలు చేసి ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని కోరారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించాలన్నారు.


చేవెళ్లలో ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు, కళాశాలల విద్యార్థులు తదితరులు

ఎంఈవో, డీఈవోలతో పాటు మెగా డీఎస్సీ రిక్రూట్మెంట్ నిర్వహించి ఉపాధ్యాయుల కొరత తీర్చాలని డిమాండ్ చేశారు. ధర్నాతో హైదరాబాద్ వెళ్లే రోడ్డుపై ఇరువైపుల భారీగా వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఏబీవీపీ నాయకులు ప్రదీప్, శ్రీకాంత్, మహిపాల్, శివ, హరికృష్ణ, కిషోర్, నితీష్, ప్రేమ్, రాఘవేందర్, అశ్విని, పూజిత, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదలలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మెగా డీఎస్సీని ఏర్పాటు చేయాలని, ఫీజుల నియంత్రణ చట్టం పటిష్టంగా అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రూ.7 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ విద్యార్థులతో కలిసి హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజీవ్ గాంధీ చౌరస్తాలో బైటాయించి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోరటి భరత్ మాట్లాడుతూ మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు. నాయకులు లండం మల్లేశ్, అంజి, మల్లేశ్, విజయ్, సిద్ధు, ప్రసాద్, రాగూర్,చర్, రాకేశ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లు : ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

సెల్‌ఫోన్ దుకాణంలో దొంగతనం

క్రైం కార్నర్

- 30 సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లిన దుండగులు

శంకర్‌పల్లి, జూలై 26: మోకిలలోని బాలాజీ మొబైల్ దుకాణంలో గురువారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. దుకాణం షట్టర్ తాళాలు విరగ్గొట్టి 30 సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. మోకిల సీఐ వీరబాబు తెలిపిన ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన జీవన్ కుమావత్ మూడేళ్ల క్రితం మోకిలలో అద్దె రూమ్ తీసుకొని మొబైల్ షాప్ నడుపుతున్నాడు. గురువారం రాత్రి దుకాణాన్ని మూసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం తాళాలు పగులగొట్టబడి ఉండటంతో స్థానికులు గమనించి జీవన్ కుమావత్‌కు సమాచారం ఇచ్చారు. అతడు దుకాణంలోకి వెళ్లిచూడగా విలువైన ఫోన్లు, నగదు పోయిందని బోరున విలపించాడు. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు వివరాలు సేకరించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జర్నలిస్టుపై దాడి.. కేసు నమోదు

మొయినాబాద్, జూలై 26 : జర్నలిస్టుపై ఓ యువకుడు దాడిచేసిన సంఘటన మండల పరిధిలోని ముర్తుజగూడలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. ముర్తుజగూడ గ్రామానికి చెందిన గణేష్ ఓ దినపత్రికలో జిల్లా రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇంట్లో నిద్రిస్తుండగా.. అదే గ్రామానికి చెందిన మోసిన్ అనే యువకుడు గణేష్ ఇంటికి వచ్చి ఇంటి గేటును తన్నాడు. బూతులు తిడుతుండగా.. ఎందుకు తిడుతున్నావని గణేష్ అడిగాడు. దాంతో ఆ యువకుడు మారణాయుధంలో గణేష్‌పై దాడి చేసేందుకు యత్నించగా తప్పించుకున్నాడు. అప్పటికే రెండు కార్లలో కొంతమంది ఉన్నట్లు గమనించిన గణేష్.. పథకం ప్రకారమే జరుగుతున్నట్లు గమనించి డయల్ 100కు సమాచారమిచ్చాడు. పోలీసులు వచ్చేసరికి ఒక కారులో ఉన్నవారు పారిపోగా.. మరో కారును స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

సీఎంఆర్‌ఎఫ్.. పేదలకు వరం

చేవెళ్ల, జూలై 26 : పేదలు, ఆపదలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 96 మంది లబ్దిదారులకు రూ.37,64,500 చెక్కులను ఆయన అందించారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీనియర్ నాయకులు వసంతం, ఎం.కృష్ణారెడ్డి, చేవెళ్ల, షాబాద్ మండలాల అధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీలు రవీందర్‌రెడ్డి, రాములు, మాజీ సర్పంచ్ శివారెడ్డి, గోపాల్‌రెడ్డి, నాయకులు నరేందర్ గౌడ్, నరేందర్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, మాణిక్యరెడ్డి, గోపాల్‌రెడ్డి, ఇక్రమొద్దీన్, ఇంద్రసేనారెడ్డి, ఆయా మండలాలా నాయకులు, లబ్దిదారులు తదితరులు ఉన్నారు.

గ్రామానికి బీటీ రోడ్డు వేయించండి

షాబాద్, జూలై 26 : గ్రామానికి రోడ్డులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎర్రోనిగూడ గ్రామస్థులు ఎమ్మెల్యే యాదయ్యకు విన్నవించారు. ఈమేరకు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆయనకు వినతి పత్రం ఇచ్చారు. గ్రామస్థులు మాట్లాడుతూ కంకర తేలి, పెద్ద పెద్ద గుంతలు ఏర్పడిన రోడ్డుపై ఎలా ప్రయాణించాలన్నారు. మల్లారెడ్డిగూడ స్టేజి నుంచి ఎర్రోనిగూడ గ్రామం వరకు మూడు కిలోమీటర్ల మేర మట్టిరోడ్డు పూర్తిగా దెబ్బతిందని, బీటీ రోడ్డు వేయించాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మాజీ ఉపసర్పంచ్ సామ ప్రతాప్ రెడ్డి, గ్రామస్థులు సుదర్శన్, మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సమాజ్‌వాదీ పార్టీ మహేశ్వరం మండలాధ్యక్షుడిగా రాజేష్

మహేశ్వరం, జూలై 26 : సమాజ్ వాదీ పార్టీ మహేశ్వరం మండలాధ్యక్షుడిగా కాకి రాజేష్ నియమితులయ్యారు. శుక్రవారం మహేశ్వరంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కటికెల శ్రీహరి అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. అనంతరం సమాజ్‌వాదీ పార్టీ మండలాధ్యక్షుడిగా రాజేష్, ఉపాధ్యక్షుడిగా బ్రహ్మేశ్వర్‌చారి, ప్రధాన కార్యదర్శిగా సాయికిరణ్, కోశాధికారిగా కుమార్, కార్యదర్శిగా యాదయ్యలను నియమించారు.

బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక


పూజలు నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి

శంకర్‌పల్లి, జులై 26: బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీన్‌కుమార్ అన్నారు. శంకర్‌పల్లిలోని పోచమ్మ దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోచమ్మతల్లి దీవెనలు పట్టణ ప్రజలపై ఉండాలని ఆమె కోరుకున్నట్లు తెలిపారు. వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు వివరించారు. ఆమెతో పాటు వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు మిరియాల శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, వడ్డె నర్సింలు తదితరులు ఉన్నారు.

జీపీ కార్మికుల వేతనాలు చెల్లించాలి


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కందుకూరు, జూలై 26: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు ఆరునెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాల, ఉద్యోగ భద్రత కల్పించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.రాంచందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులతో కలిసి మండల కేంద్రంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి ఎంపీడీవోకు వినతిపత్రం ఇచ్చారు. కారోబార్ల సంఘం నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, యాదయ్య, నర్సింహ, సురేందర్, ప్రకాశ్, అంజయ్య రాములు, నర్సింహ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

కందుకూరు, జులై 26: నేడు కాంగ్రెస్ పార్టీ మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణానాయక్‌లు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నేడు(శనివారం) ఉదయం 11గంటలకు మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి


మహేశ్వరం : ఆకన్‌పల్లిలో మొక్కలు నాటి నీరు పోస్తున్న ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి


కందుకూరు : విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న నేదునూరు స్కూల్ హెచ్‌ఎం


శంకర్‌పల్లి : మొక్కలతో కొండాకల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు

మహేశ్వరం, జూలై 26 : ప్రతితీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని మండల ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని ఆకన్‌పల్లి గ్రామంలో వన నర్సరీని పరిశీలించడంతో పాటు గ్రామంలో మొక్కలు నాటారు. వన మహోత్సవంలో మొక్కలు నాటిస్తున్న అధికారులకు గ్రామాల ప్రజలు, యువత సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శైలజ, ఏపీవో పరిమళ తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : మొక్కలు నాటి పర్యావరణ హితానికి పాటు పడాలని కొండాకల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీవనజ్యోతి తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యదర్శి ఎల్లయ్య. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : ప్రతీ ఒక్కరు విధిగా మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని నేదునూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జయమోహన్‌రెడ్డి కోరారు. విద్యార్థులతో కలిసి పాఠశాలలో దాదాపు 100 మొక్కలను నాటినట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'కార్గిల్' అమరులకు ఘన నివాళి


అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న భగీరథ్, నాయకులు

కడ్తాల్, జూలై 26: అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవాలని బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు సభావట్ సురేశ్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం బీజేవైఎం ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించారు. సురేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి కాంటేకార్ భగీరథ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వీర సైనికులకు నాయకులు నివాళి అర్పించారు. దేశ రక్షణకు ప్రతీ ఒక్కరు నడుం బిగించాలని, విద్యార్థులు, యువకులు దేశభక్తి భావాలు పెంపొందించుకోవాలని భగీరథ్ కోరారు. కార్గిల్ యుద్ధంలో భారత సైనికుల ధైర్య సాహసాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు శ్రీశైలంగౌడ్, బీజేపీ మండలాధ్యక్షుడు సిద్ధిగారి కుమార్, నాయకులు అజిత్, రాకేశ్, సిద్దార్థ, నందీశ్వర్, దశరథం,అరుణ్, భరత్, వేణు, చరణ్, వంశీ, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనార్టీల శ్మశాన వాటికకు స్థల పరిశీలన

ఇబ్రహీంపట్నం, జూలై 26: ఇబ్రహీంపట్నంలోని తట్టిఖానా గోశాల రోడ్డులో క్రిస్టియన్ మైనార్టీల శ్మశాన వాటిక కోసం గుర్తించిన స్థలాన్ని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ కొక్కడన్, ఎండీ పి. సబిత, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి నవీన్‌రెడ్డిలు పరిశీలించారు. ఇక్కడ సర్వేనెం.38లో ఐదెకరాల స్థలాన్ని శ్మశాన వాటిక కోసం గుర్తించారు. హైదరాబాద్ చుట్టూ పలుచోట్ల 50 ఎకరాల స్థలాన్ని శ్మశాన వాటికల కోసం సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, దాంతో స్థల పరిశీలన చేసినట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ గుర్తించిన స్థలానికి అప్రోచ్ రోడ్డు ఏవైపు నుంచి తీసుకోవాలనేది కూడా పరిశీలిస్తున్నామన్నారు. వారి వెంట డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, సర్వేయర్ సాయికృష్ణారెడ్డి, ఆర్ఐ కృష్ణ తదితరులు ఉన్నారు.


శ్మశాన వాటిక కోసం గుర్తించిన స్థలాన్ని పరిశీలిస్తున్న దీపక్ జాన్ కొక్కడన్, తదితరులు

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఆమనగల్లు, జూలై 26: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవని, ప్రతీఒక్కరు శుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ వసంత తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ఆమనగల్లు మున్సిపాలిటీ సాకిబండ తండాలో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


జానపద గేయాలతో అవగామన కల్పిస్తున్న కళాకారులు

కందుకూరు, జూలై 26: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా సాంస్కృతిక సారథి బృందం మండలంలోని మీర్కాన్‌పేట గ్రామంలో జానపద గేయాల ద్వారా గ్రామస్తులను చైతన్యం చేశారు. కలెక్టర్, ఆదేశానుసారం డీపీఆర్‌వో ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో మూడు గంటల పాటు ప్రధాన వీధుల్లో జానపద గేయాల ద్వారా ప్రజలను చైతన్యం చేశారు. కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు, జూలై 26: ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెల్దండ మండల కేంద్రం సమీపంలో గల ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభిస్తోంది. చెన్నై శంకరన్ కంటి ఆసుపత్రి సహకారంతో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఈనెల 18 నుంచి శిబిరాన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు కల్వకుర్తి నియోజకవర్గంలోని 2100 మందికి పరీక్షలు నిర్వహించారు. 140 మందికి కంటి శుక్లాలు ఉన్నట్లు గుర్తించి శుక్రవారం 35 మందికి శస్త్ర చికిత్సలు చేశారు. 1300ల మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి ఉచితంగా కంటి అద్దాలు అందించినట్లు ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్ రెడ్డి తెలిపారు. సభ్యులు వరప్రసాద్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీరాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, కొండల్, అభినవ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

యాచారం, జూలై 26 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికిగాను సీఈసీ, ఎంఈసీ గ్రూప్‌లలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్ తెలిపారు. నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులు ఆధార్‌కార్డు, కులం. ఆదాయం, నివాసం, 4 పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, టీసీ, టెన్త్ పాస్‌మెమో తీసుకొని పాఠశాలలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు


ఆమనగల్లు : కేక్‌కట్ చేస్తున్న సీఎల్ శ్రీనివాస్ యాదవ్

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి, జూలై 26 : బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, తలకొండపల్లి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం బీఆర్‌ఎస్ యూత్ వింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, మాజీ ఎంపీటీసీ కుమార్, యూత్ వింగ్ మండలాధ్యక్షుడు వడ్డె వెంకటేశ్, మండల నాయకులతో కలిసి శ్రీనివాస్‌యాదవ్ కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలుచోట్ల మొక్కలు నాటారు. ఆసుపత్రిలో పాలు, పండ్లు పంపిణీ చేశారు. నాయకులు గుత్తి బాలస్వామి, సోనశ్రీనునాయక్, భాస్కర్, తదితరులున్నారు. కడ్తాల మండల కేంద్రంలో శ్రీనివాస్‌యాదవ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ నివాసం వద్ద నిర్వహించిన వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డిలతో కలిసి శ్రీనివాస్‌యాదవ్ కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. మైసిగండి మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. లాయక్‌అలీ, నర్సింహ, విజయ్‌రెడ్డి, తదితరులున్నారు. తలకొండపల్లి మండల కేంద్రంతోపాటు వెల్జాల, చంద్రధనలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. శ్రీనివాస్ యాదవ్ కేక్‌కట్ చేశారు. వెంకటయ్య, విజయ్, కుమార్‌రెడ్డి, బాలకుమార్, తదితరులు పాల్గొన్నారు.


కడ్తాల్ : మొక్కలు నాటుతున్న శ్రీనివాస్‌యాదవ్, దశరథ్ నాయక్

కొత్తూర్‌ను సుందరంగా తీర్చిదిద్దుతా


రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్: జూలై 26: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్తూర్ మున్సిపాలిటీ అభివృద్ధిని విస్మరించడంతో ప్రజలు నానా ఇబ్బందులకు గురైనారని, మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దే బాధ్యత నాదేనని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. దాదాపు రూ.4కోట్లతో నిర్మిస్తున్న కొత్తూర్ ప్రధాన రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. వైజంక్షన్ నుంచి జ్యోతిరావు పూలే చౌరస్తా వరకు రోడ్డు గోతులమయంగా మారడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, ప్రజా సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక నిధులతో రోడ్డును నిర్మిస్తున్నామని తెలిపారు. నెల రోజుల్లోగా రోడ్డు నిర్మాణం పూర్తవుతుందన్నారు. వైజంక్షన్ నుంచి పూలే విగ్రహం వరకు రోడ్డు నాలుగు లేన్లతో పాటు బటర్‌ఫ్లై లైట్లు ఏర్పాటు చేయించి సుందరంగా తీర్చిదిద్దుతానన్నారు. మున్సిపాలిటీలోని అసంపూర్తిగా నిలిచిపోయిన కుమ్మరిగూడ రోడ్డును త్వరలో పూర్తి చేయించేందుకు నిధులు మంజూరు చేయిస్తానన్నారు. మున్సిపాలిటీ ప్రజలకు సమస్యలు ఎదురుకాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బాలాజీని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, కాంగ్రెస్ నాయకులు జె.సుదర్శన్‌గౌడ్, ఇందూరి శ్రీను, జె.శ్రీశైలంగౌడ్, గోవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజన విభాగం జిల్లా చైర్మన్‌గా శ్రీను నాయక్

షాద్‌నగర్ అర్బన్, జూలై 26: కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ గిరిజన విభాగం జిల్లా చైర్మన్‌గా షాద్‌నగర్‌కు చెందిన పాత్లావత్ శ్రీనునాయక్ నియమితులైనారు. ఆ విభాగం చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందుకున్న శ్రీను నాయక్ శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిశారు. ఎమ్మెల్యే శ్రీను నాయక్‌ను సన్మానించి అభినందించారు. పార్టీ కోసం పని చేసేవారిని పదవులు వరిస్తాయని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, బెల్లయ్య నాయక్, వీర్లపల్లి శంకర్‌కు శ్రీను నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

దళితుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట


అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్, జూలై 26: దళితుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్‌లు అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీల సంక్షేమానికి రూ.33,124 కోట్లు కేటాయించడాన్ని హర్షిస్తూ మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు అశోక్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతమ్ ఆదేశానుసారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జిల్లా, మండల నాయకులు గూడూరు భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, నరేశ్, శంకర్, శ్రీశైలం, చెన్నయ్య, భరత్‌యాదవ్, నర్సింహ, మంకిశ్రీను, మల్లయ్య, పురుషోత్తం, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలకనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు

తలకొండపల్లి, జూలై 26: 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశ పెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అద్దం పడుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కిసాన్ సెల్ కార్యదర్శి డి.మోహన్‌రెడ్డి అన్నారు. మండలం కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బడ్జెట్‌లో అన్ని వర్గాలకు, సంక్షేమ, అభివృద్ధి రంగాలకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. వ్యవసాయ రంగానికి మునుపెన్నడూ లేనివిధంగా రూ.72,659 కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన పథకాలకు అనుగుణంగా నిధుల కేటాయింపు చేయడం జరిగిందన్నారు. డీసీసీ కార్యదర్శి రవీందర్ యాదవ్, సోషల్‌మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి అజీం, నాయకులు శేఖర్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

'విద్యా రంగానికి సరిపడా నిధులు కేటాయించలేదు'

ఇబ్రహీంపట్నం, జూలై 26: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి సరిపడా నిధులు కేటాయించలేదంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నం చౌరస్తా వద్ద నిరసన తెలిపి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు వంశీ, తరంగ్‌లు మాట్లాడుతూ బడ్జెట్‌లో కేవలం 7.3శాతం మాత్రమే విద్యారంగానికి నిధులు కేటాయించడం నిరాశ కలింగించిందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ రంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదంటూ ఆరోపించారు.

విద్యార్థులు శ్రద్ధగా చదివి వృద్ధిలోకి రావాలి


ప్యాడ్లు పంపిణీ చేస్తున్న టీచర్లు

షాబాద్, జూలై 26 : విద్యార్థులు శ్రద్ధగా చదివి వృద్ధిలోకి రావాలని ఎల్గొండగూడ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం మల్లేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పాఠశాల విద్యార్థులకు శంషాబాద్‌కు చెందిన హిందూ వికాస్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా విద్యార్థులకు మెదడువాపు నివారణ వ్యాక్సిన్ వేశారు.

సంక్షిప్తంగా..

తలకొండపల్లి : దైవ కార్యక్రమాల్లో ప్రతీఒక్కరు పాలు పంచుకోవాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు జీనుకుంట్ల భాస్కర్ అన్నారు. గట్టిప్పలపల్లిలో నూతనంగా నిర్మించే పోచమ్మ దేవాలయ నిర్మాణానికి భాస్కర్ రూ.20వేల విరాళం నిర్వాహకులకు అందజేశారు.

కందుకూరు : కందుకూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన ఉచిత సంతాన సాఫల్య వైద్యశిబిరం విజయవంతమైనట్లు క్లబ్ అధ్యక్షుడు విఠల్‌రెడ్డి తెలిపారు. స్థానిక భూలక్ష్మీమెమోరియల్ ఆస్పత్రిలో డాక్టర్ శ్రావ్య తాళ్లపురెడ్డి సమక్షంలో 42 మందికి పరీక్షలు నిర్వహించగా.. 12మందిని ఫెర్టిలిటీ హాస్పిటల్‌కు తరలించినట్లు తెలిపారు.

యాచారం : మెదడు వాపు నివారణకు జేఈ వ్యాక్సిన్‌ను మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి వైద్యసిబ్బంది పాఠశాలలు తిరిగి విద్యార్థులకు వ్యాక్సిన్ ఇస్తున్నారు. ఆగస్టు 15వరకు పాఠశాలల్లో వ్యాక్సిన్లు వేస్తామని వైద్యులు తెలిపారు.

యాచారం : ఎస్సీ, ఎస్టీ రైతులకు రాయితీపై పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల పశుసంవర్ధకశాఖ అధికారిణి డాక్టర్ రేఖ ఒక ప్రకటనలో తెలిపారు. 5 కిలోల బస్తాకు రైతులు రూ.341.25లకుగాను 75 శాతం రాయితీపై రూ.113.75లకు రైతులు కొనుగోలు చేయాలని చెప్పారు. ఆసక్తిగల రైతులు మండల కేంద్రంలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో పశుగ్రాస విత్తనాలు కొనుగోలు చేసుకోవాలని ఆమె రైతులకు విజ్ఞప్తి చేశారు.

కందుకూరు : నేదునూరు గ్రామంలో నిరుపేద కుటుంబానికి బీజేపీ నాయకులు చేయుతనందించారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో గ్రామానికి చెందిన వడ్ల లింగమయ్య ఇంటి పైకప్పు ప్లాస్టిక్ కవర్‌తో ఉండడాన్ని గమనించిన బీజేపీ నాయకులు ఆ కుటుంబానికి రూ:30వేల నగదును అందజేసినట్లు ఆ పార్టీ నాయకులు గంగుల కృష్ణారెడ్డి తెలిపారు. నాయకులు ఎస్.వెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి, మైసయ్య, తదితరులున్నారు.

శంకర్‌పల్లి : ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని పర్వేద ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నర్సింగ్‌రావు తెలిపారు. పర్వేద ఉన్నత పాఠశాల నుంచి బదిలీ వెళ్లిన ఉపాధ్యాయులను శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు.

చేవెళ్ల : గ్రామీణ ప్రాంతంలోని పేదలకు సాయం చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని రామన్నగూడకు చెందిన యువ నాయకుడు పెద్దోళ్ల దయాకర్ తెలిపారు. చేవెళ్ల మాజీ జడ్పీటీసీ పెద్దోళ్ల పర్మయ్య జ్ఞాపకార్థం గ్రామంలో ఆయన కుమారుడు దయాకర్ గ్రామంలో ఆసరా పింఛన్‌దారులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు.